


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

నేటి సందెకాడ రేపటి పొద్దు జాడ — 20 YEARS ANNIVERSARY

https://www.satyamdaily.net/

శుక్రవారం 22-8-2025

సంపుటి: 21 సంచిక: 129

పేజీలు: 8 వెల: రూ.1

## అదే 'సత్యం'..
# అది సర్కారు స్థలం!

- ✯ వార్తా కథనానికి స్పందించిన రెవెన్యూ అధికారులు
- ✯ సర్వే చేసి జిరాయితీ కాదని తేల్చి హద్దుల ఏర్పాటు
- ✯ కే.మత్స్యలేశంలో అక్రమానికి అడ్డుకట్ట

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అక్రమాలు నిజమే.. అది ముమ్మాటికీ సర్కారు భూమేనని ఎట్టకేలకు అధికారులు తేల్చారు. 'సత్యం'లో 'మొన్న ప్రభుత్వ భూమి.. నేడది జిరాయితీ' శీర్షికతో ప్రచురితమైన కథనంతో అధికారులు ఆగమేఘాలపై స్పందించి రీసర్వే చేయించడంతో లోగుట్టు బయటపడింది. కే.మత్స్యలేశం పరిధిలోని సర్వే నెంబర్ 211/6 లోని 1.56 ఎకరాలు






జిరాయితీ కాదని గార మండల రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. ఈ భూమిపై అదే గ్రామానికి చెందిన బొంది రమణారావు గత నెల 11న గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఫిర్యాదుపై రోజులు గడుస్తున్నా గార రెవెన్యూ అధికారులు స్పందించలేదు. దాంతో గ్రామస్తులు 'సత్యం' పత్రికను - మిగతా చివరి పేజీలో

# డీమ్డ్ ఫీట్లు.. కాలేజీల పాట్లు

- ✓ అక్కడ రూ.లక్షలు చెల్లించి మరీ చేరిక
- ✓ ఇక్కడ సీట్లే నిండక యాజమాన్యాలు విలవిల
- ✓ క్యాంపస్ డ్రైవ్‌లు వాటి ప్రచార వ్యూహాల్లో భాగమే
- ✓ మర్మం తెలుసుకోలేక.. వాటివైపే మొగ్గుతున్న తల్లిదండ్రులు
- ✓ ఫలితంగా వేలసంఖ్యలో మిగిలిపోతున్న సీట్లు




**రాష్ట్రంలో నాలుగోవంతు ఇంజినీరింగ్ సీట్లు ఖాళీగా ఉండిపోతున్నాయనే వాదనలో పస లేదు. ఇప్పుడు డీమ్డ్ యూనివర్సిటీల మీదే తల్లిదండ్రులు మోజు చూపుతున్నారు. అంతంతమాత్రంగా సంపాదిస్తున్నవారు సైతం తమ పిల్లల్ని అటానమస్ లేదా డీమ్డ్ వర్సిటీల్లో చేర్చడానికే మొగ్గు చూపుతున్నారు. అందువల్లే ఇతర ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్లు మిగిలిపోతున్నట్టు కనిపిస్తోంది.**

✍ సీహెచ్ దుర్గాప్రసాద్,
డైరెక్టర్, పద్మావతి కళాశాల



వాస్తవానికి కన్వీనర్ కోటాలో ఉన్న సీట్ల కంటే విద్యార్థులు తక్కువగా ఉండటంవల్ల రాష్ట్రంలో 34,298 సీట్లు మిగిలిపోయాయి. అలాగే విశ్వవిద్యాలయాల్లో 1361 సీట్లు ఖాళీగా ఉన్నాయి. యాజమాన్య కోటా కలిపితే ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. కన్వీనర్ కోటా సీట్లకు సాంకేతిక విద్యాశాఖ రెండు విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించింది. అయినా ప్రైవేటు కళాశాలల్లో ఏకంగా 31,811 సీట్లు, ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో 1126 సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోయాయి. కౌన్సెలింగ్‌కు రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులకంటే సీట్లే ఎక్కువగా ఉండటం వల్ల ఈ పరిస్థితి దాపురించింది. ఇంజినీరింగ్ సెట్‌లో 1,84,248 మంది అర్హత సాధించగా వారిలో 1,29,012 మంది కన్వీనర్ కోటాలో చేరేందుకు రిజిస్టర్ చేసుకున్నారు. ప్రైవేటు వర్సిటీలు, కళాశాలలు, ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో కలిపి కన్వీనర్ కోటా కింద 1,53,966 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అర్హత సాధించినవారందరికీ సీట్లు కేటాయించినా, ఇంకా 25 వేలకు పైగా సీట్లు మిగిలిపోతాయి. ఈ పరిస్థితి దాపురించడానికి ప్రధాన కారణం.. రాష్ట్రంలో ప్రతి ఇంజినీరింగ్ కాలేజీకీ అడిగిందే తడవుగా సీట్ల పెంచుకోవడానికి ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం ఒకటి కాగా.. డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో వంద శాతం సీట్లను యాజమాన్యమే భర్తీ చేసుకోవడం మరో కారణం. ప్రతి డీమ్డ్ యూనివర్సిటీకి ప్రత్యేకంగా ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఇందులో సాధించే ర్యాంకులను బట్టి ఫీజులు, మేనేజ్‌మెంట్ కోటాలతో భర్తీ చేసుకుంటున్నారు.

### కొలువు ఖాయమన్న భ్రమలు

శ్రీకాకుళంలో ఒకప్పుడు జీఎంఆర్ ఐటీలో సీటొచ్చిందంటే అబ్బో.. అంటూ నోరెళ్లబెట్టే పరిస్థితి. దాని తర్వాత టెక్కలిలో ఐతమ్ కాలేజీ మీద అంతో ఇంతో మోజుండేది. కానీ ఇప్పుడు - మిగతా చివరి పేజీలో



- ❖ సామాన్యుడి నుంచి సేవకుడిగా
- ❖ సేవల్లో ఘనాపాటి.. లేరు సాటి
- ❖ నిరంతర శ్రామికుడు.. ప్రజాసేవకుడు
- ❖ స్నేహశీలి, సౌమ్యుడిగా ప్రజల మనసుల్లో ముద్ర
- ❖ ఎస్ఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా విస్తృత సేవలు

**కష్టం మనింటి తలుపు తడితే.. ఆ కష్టం తీరాలంటే ఆ మనిషికి చెప్పుకోవాలి అనేంతలా మారిపోయింది ఆ వ్యక్తి పేరు. గుడికెళ్తే దేవుడు ఆదుకుంటాడో లేదో తెలియదు కానీ.. మన కష్టం ఆయనకు తెలిస్తే మాత్రం వెంటనే స్పందించే తత్వం అతనిది. ప్రతి మనిషికి దేవుడు చేతులిచ్చింది పని చేసుకుని బతకడానికి అనుకుంటాం.. కానీ అతను మాత్రం సాయం చేయడానికి, కష్టాల్లో ఉన్నవారి కన్నీరు తుడవడానికి అంటారు. కష్టంలో ఉంటే ఆదుకునేవారు చాలా తక్కువమంది. ఉన్నంతలో సాయం చేసేవారు ఇంకొంతమంది. కానీ ఉన్న సమస్య గురించి సమాచారం అందిన వెంటనే స్పందించే ఏకైక వ్యక్తి సూర శ్రీనివాసరావు.**

Advertorial

# సేవాధీరుడు..
# సూర శ్రీనివాసుడు





**కరోనా సృష్టించిన విలయ తాండవంలో రోడ్డున పడిన ఎందరికో బాసటగా నిలిచిన ఎస్ఎస్ఆర్ ఇంకెందరికో దేవుడు అయిపోయారు. ఇప్పుడు సూర శ్రీనివాసరావు అంటే జిల్లా వాసులకు పేరు కాదు.. బ్రాండ్. తన సేవలను మరింత విస్తృతం చేసేందుకు 2021 ఆగష్టు 23న తన పుట్టిన రోజున ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు ప్రారంభించారు. ఏడాది కాలంలో ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్య, వైద్యం, క్రీడలు, పేదలు, ఆధ్యాత్మిక రంగాల్లో అనేక సేవలు అందిస్తున్నారు. ఇలా అనునిత్యం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సూర శ్రీనివాసరావు ప్రజల హృదయాల్లో సేవా ధీరుడిగా చెరగని, తరగని ముద్ర వేసుకున్నారు. ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా అనేక గ్రామాల్లో మంచినీటి కుళాయిలు, అనేక పాఠశాలల్లో దేవతల, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను ఏర్పాటుచేశారు. పలు చోట్ల దేవాలయాలు నిర్మించారు. ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక కథనం.**

ఆయనో అలుపెరగని యోధుడు.. నిస్వార్థ ప్రజాసేవకుడు.. పేదల మనసుల్లో గుడి కట్టుకున్న భగవంతుడు.. సేవ చేయడమే తప్ప ఫలితం ఆశించే వ్యక్తి కాదు.. అతడే సూర శ్రీనివాసరావు. కరోనా రక్కసి ఊరు, వాడను మింగిస్తున్న వేళ.. మానవత్వం, దాతృత్వం, సేవాతత్వం వంటి లక్షణాలు మనుషుల నుంచి మాయమవుతున్న వేళ.. నేనున్నానంటూ ముందుకు వచ్చారు. ఏకకాలంలో మానవత్వంతో నిండిన మనసుతో సేవాతత్పరతను కలిగి దాతృత్వం వైపు అడుగులు వేశాడు. కరోనా బాధితులకు, వారి సహాయకులకు ఆహారం అందించి వారి పాలిట అన్నార్తుడయ్యారు. పనుల్లేక అర్ధాకలితో అలమటిస్తున్న నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేసి, వారి పాలిట ఆరాధ్యుడయ్యారు. లాక్‌డౌన్‌లో ఇబ్బందులు పడిన రోజువారి కూలీలకు, ప్రైవేటు పాఠశాలల సిబ్బందికి, సినిమా హాల్ కార్మికులకు, విశ్వబ్రాహ్మణ, జర్నలిస్టులకు, పేద కళాకారులకు వేలాదిగా నిత్యవసర సరుకులను పంపిణీ చేసి వారి పాలిట ఆపద్బాంధవుడయ్యారు.. రోగులకు, మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసి వారికి సహాయకుడయ్యారు.. అలాగే విద్య, వైద్య, జైలు, ఆధ్యాత్మికత, క్రీడలు అన్ని రంగాల్లోనూ తన సేవలను విస్తృతం చేశారు. అన్నార్తులకు ఆరాధ్యుడిగా, - మిగతా లోపలి పేజీలో



• ఎడిటోరియల్

# ఉప రాష్ట్రపతి ఎన్నికలోనూ కుల రాజకీయమా?

ఉపరాష్ట్రపతి ఎన్నిక జాతీయ అంశం. అన్ని రాష్ట్రాలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ ఆయన్ను ఎన్నుకుంటుంది. అంతకుమించి అందులో రాజకీయాలు, రాష్ట్రాల ప్రాధాన్యత వంటివి పెద్దగా పరిగణనలోకి రావు. కానీ ప్రస్తుతం జరుగుతున్న ఉప రాష్ట్రపతి ఎన్నిక విషయంలో తెలుగు రాష్ట్రాల్లో మాత్రం అభ్యర్థుల రాష్ట్రీయత, భాష వంటివి ప్రముఖంగా ప్రస్తావనకు వస్తున్నాయి. వాటి మాటున రాజకీయాలు చొరబడుతున్నాయి. రాజ్యాంగ పదవులైన రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతులను పార్టీలకు అతీతంగా ఏకగ్రీవంగా ఎన్నుకునే గత సంప్రదాయం మరుగున పడిపోయింది. అదే క్రమంలో ఉప రాష్ట్రపతి ఎన్నికకు ఎన్డీయే కూటమి తమిళనాడుకు చెందిన రాధాకృష్ణన్‌ను బరిలోకి దింపితే.. ప్రతిపక్ష ఇండియా కూటమి తెలంగాణకు చెందిన రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఆయనకు పోటీగా నిలబెట్టింది. ఎలక్టోరల్ కాలేజీలో బలాబలాలను చూస్తే గెలుపు ఎన్డీయేదేనని స్పష్టమవుతున్నా.. ఎన్నిక అనివార్యం. ఆ మేరకు రెండు కూటములు తమ అభ్యర్థులకు మద్దతు కూడగట్టేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో రాజకీయాలు ప్రస్ఫుటమవుతున్నాయి. ఎవరి రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా వారు పావులు కదుపుతున్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని సూచించారని చెబుతున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలే దీనికి నిదర్శనం. తెలుగువాడు, తెలంగాణవాసి అయినందున ఇండీ కూటమి అభ్యర్థి సుదర్శన్‌రెడ్డికి తెలుగు రాష్ట్రాలకు చెందిన చంద్రబాబు, కేసీఆర్ తమ పార్టీలపరంగా మద్దతు ఇవ్వాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు. దీనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ అభ్యర్థి విషయంలో తమను ఏ పార్టీ సంప్రదించలేదని, అలాంటప్పుడు మద్దతు ఎలా అడుగుతారని ఘాటుగా ప్రశ్నించారు. కేటీఆర్ స్పందన రాజకీయంగా కరెక్టే. అధికార పార్టీ అభ్యర్థనపై ప్రతిపక్ష నేతగా అలా స్పందించడంలో తప్పులేదు. కానీ దానికి కొనసాగింపుగా ప్రస్తావించిన అంశాలపైనే అభ్యంతరాలు ఉన్నాయి. 'ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేయించడానికి తెలంగాణ మొత్తంలో ఒక్క బీసీ అభ్యర్థి కూడా దొరకలేదా?' అని కేటీఆర్ ఆవేశంగా ప్రశ్నించారు. అదే ఊపులో కంచె ఐలయ్యను అభ్యర్థిగా ప్రకటించి ఉండాల్సిందని కూడా ఆయన అన్నారు. ఇది రాజకీయంగా బీసీ సామాజిక వర్గాన్ని ఆకర్షించటానికి పనికొస్తుందేమో కానీ అన్ని వర్గాలను సంతృప్తిపరచలేదు. మరోవైపు రేవంత్ రెడ్డి తన అభ్యర్థనలో 'తెలుగువాడైన పీవీ నరసింహారావును గెలిపించుకోవడానికి గతంలో ఎన్టీఆర్ తమ పార్టీ తరపున ఎవరినీ పోటీకి దింపని విషయాన్ని ఉదాహరణగా ఉటంకించినా కూడా కేటీఆర్ బీసీ పల్లవి ఎత్తుకోవడం పూర్తిగా రాజకీయ దృక్కోణంగానే పరిగణించాలి. ఇదే వాదాన్ని ఆరోజు ఎన్టీఆర్ కూడా వినిపించి ఉంటే ఒక తెలుగువాడు దేశంలో చక్రం తిప్పే పరిస్థితులు వచ్చేవి కావేమో? 'ఎన్నికలు వచ్చే సరికి బీసీలను మర్చిపోయారా?' అని కూడా చివరాఖర్లో కేటీఆర్ ప్రశ్నించారు. వాస్తవానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే బీసీ నేతను ముఖ్యమంత్రి చేస్తానని అప్పట్లో కేసీఆర్ వాగ్దానం చేశారు. కానీ అధికారం అందిన తర్వాత ఆ హామీని విస్మరించి తానే ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. ఒకపక్క తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇక్కడి అభ్యర్థిని బరిలోకి దింపటానికి ఇండీ కూటమిని ఒప్పించి దేశ రాజకీయాల్లో మెరుస్తున్న తరుణంలో బీసీలు, ఓసీలంటూ ప్రజలను విభజించి రాజకీయాలు చేస్తే లోకువ కావడం తప్ప ప్రయోజనం ఉండదు. పార్టీ పేరులో తెలంగాణను తీసి పక్కన పెట్టినప్పుడే ప్రజలు కూడా బీఆర్ఎస్ పార్టీని పక్కన పెట్టారు. గెలుపు ఓటములను పక్కన పెడితే.. మళ్లీ తెలంగాణ వాదాన్ని ఢిల్లీ వీధుల్లో బలంగా వినిపించే అవకాశం ఉప రాష్ట్రపతి ఎన్నిక రూపంలో వచ్చింది. ఈ అవకాశాన్ని రేవంత్ అందిపుచ్చుకుంటే.. తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లమని చెప్పుకొనే బీఆర్ఎస్ కుల రాజకీయం చేస్తోంది. రేవంత్‌రెడ్డి అత్యంత వ్యూహాత్మకంగా తెలంగాణా వాదంతో పాటు తెలుగు భాషావాదాన్ని వాడుకుని చంద్రబాబుని కూడా ముగ్గులోకి లాగారు. అవహేళనల జోలికి పోకుండా సాటి తెలుగువాడిగా తమ అభ్యర్థికి మద్దతు ఇవ్వమని అటు ఏపీని.. సాటి తెలంగాణా వాడికి మద్దతు ఇవ్వమని ఇటు తెలంగాణావాదులను అభ్యర్థించి తన అమ్ముల పొదిలోని రెండు బాణాలను ఒకేసారి సంధించారు. ఇది చాలా తెలివైన వ్యూహం. సాటి తెలంగాణావాదిగా బలపరచవచ్చు లేదా వ్యూహాత్మక మౌనం పాటించవచ్చు. కానీ అందులోనూ రాజకీయం చేయడం మాత్రం తగదు.

## జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వండి

**కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని రాజకీయ పార్టీలు పక్షపాతాలకు అతీతంగా ఐక్య ప్రగతి శీల కూటమి (యూపీఏ) ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి పిలుపునిచ్చారు. తెలుగు దేశం, జనసేన, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, భారత రాష్ట్ర సమితిలకు జస్టిస్ రెడ్డికి మద్దతు ఇవ్వడంలో ఐక్యంగా ఉండాలని శుక్రవారం ఒక ప్రకటనలో కృపారాణి విజ్ఞప్తి చేశారు. ఆయన పదోన్నతి తెలుగు ప్రజలకు గర్వకారణమన్నారు. స్వతంత్ర భారతదేశ ఎనిమిది దశాబ్దాల చరిత్రలో నీలం సంజీవరెడ్డి, ఎం.వెంకయ్యనాయుడు తర్వాత దేశంలో రెండవ అత్యున్నత రాజ్యాంగ పదవికి ఒక తెలుగు నాయకుడిని పరిగణించడం ఇది మూడోసారి మాత్రమేనని తెలిపారు. ఐక్యతను ప్రదర్శించడానికి, తెలుగు వ్యక్తి మరోసారి ఉపరాష్ట్రపతి పదవిని చేరుకునేలా చూసుకోవడానికి అరుదైన అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. పూర్వాపరాలను ఉటంకిస్తూ, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ద్రౌపది ముర్ముకు ఎలా మద్దతు ఇచ్చారో, శివసేన అధినేత బాల్ థాకరే రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ ప్రతిభా పాటిల్‌కు ఎలా మద్దతు ఇచ్చారో కృపారాణి గుర్తు చేసుకున్నారు. అదే స్ఫూర్తితో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, జగన్ మోహన్ రెడ్డి, కేసీఆర్ తమ ఎంపీలను జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఓటు వేయమని సూచించాలని ఆమె కోరారు.



ప్రముఖ సినీనటుడు చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకుని శుక్రవారం నాగావళి తీరంలో ఆయన అభిమానులు సైకత శిల్పాన్ని హరికృష్ణ ఆధ్వర్యంలో చెక్కించారు. అదే విధంగా స్థానిక ఏడురోడ్ల కూడలిలో జయదుర్గ ట్యాక్సీస్టాండ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో శ్రీ నీలమ్మ తల్లి వాడబలిజ యువజన సేవ సంఘం అధ్యక్షులు మైలపల్లి నరిసింహమూర్తి, 1980స్ జిల్లా సీనియర్ చిరంజీవి అభిమానసంఘం అధ్యక్షులు ఎస్.సిద్దయ్యబాబు, కొమర మురళి, కోడ లక్ష్మణ, ఎస్.సత్యం, పి.మోహన్, గనగళ్ళ కొర్లయ్య, సీహెచ్.కన్నారావు, ఎం.రాజేష్, పి.వినోద్, ఎస్.అప్పలరాజు, ఆర్.మోహన్, ఎస్.మాధవ, టి.నూకరాజు, ఆర్.చంటి, లోకేష్ ఎస్.వేణు, పి.వర్మ తదితరులు పాల్గొన్నారు. **– సత్యంన్యూస్, శ్రీకాకుళం**



ఈనెల 30న బీజేపీ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించనున్న సంచారజాతుల విముక్తి దినోత్సవం సందర్భంగా నగరంలో ఆ పార్టీ నాయకులు చౌదరి పురుషోత్తంనగర్ కాలనీలో పలువురు సంచార జాతులను కలిసి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ రాష్ట్ర కో–కన్వీనర్ (సంచార జాతులు విభాగం) పి.సురేష్ బాబుసింగ్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు జి.కరుణాకర్, వెస్ట్ మండలం అధ్యక్షులు సీహెచ్.భూషణ్ పాల్గొన్నారు.

**– సత్యంన్యూస్, శ్రీకాకుళం.**

## మొండేటివీధిలో మట్టి వినాయకుల పంపిణీ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొండేటి వీధిలో గల శ్రీశ్రీశ్రీ లక్ష్మీ గణపతి స్వామి ఆలయంలో ఈనెల 24న మట్టి గణపతి విగ్రహాలు, వ్రతకథ పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 నుంచి వచ్చేనెల 4 వరకు వినాయక నవరాత్రులు ఏర్పాటు చేయనున్నామన్నారు. దీనిలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు విగ్రహాల పంపిణీ నిర్వహించనున్నామన్నారు. కావల్సిన వారు హాజరైన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే నా ధ్యేయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. ఈమేరకు స్థానిక విశాఖ కాలనీ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వారి పరిధిలోగల సమస్యలపై వినతులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, రూరల్, గార, పరిసర గ్రామ ప్రజలు, టీడీపీ నగర, మండల నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.



## అమరవీరుల ప్రతిజ్ఞ దినం జయప్రదం చేయండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఆగష్టు 28న విద్యుత్ అమరవీరుల ప్రతిజ్ఞ దినం జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాసు పిలుపునిచ్చారు. ఈమేరకు సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు ద్వారా ప్రజలను తీవ్రంగా దోపిడీ చేయడానికి పూనుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికలకు ముందు తెలుగుదేశం కూటమి కరెంటు చార్జీలు పెంచబోమని బాదుడు ఆపుతామని అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహన్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా నాయకులు బి.కృష్ణమూర్తి, జి.సింహాచలం, పి.తేజేశ్వరరావు, ఎన్.షణ్ముఖరావు, సిహెచ్.అమ్మన్నాయుడు, ఎస్.లక్ష్మీనారాయణ, పి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.






# అప్పుడే.. 70 ఏళ్లా?!

**అప్పుడే నీకు 70 యేళ్ళా!?.. చాల్లే ఊరుకో అన్నయ్య వయసెందుకు ఎక్కువ చెప్పుకుంటావ్!? ఓలెక్కన చూస్తే నువ్వు నాకంటే చిన్నోడివే.. ఎలా అంటావా.. నా నాలుగోయేట "మనవూరి పాండవుల్లో" ఒక్కడిగా పుట్టావ్..మరి ఆ లెక్కల్లో చూస్తే నాకన్నా చిన్నోడివేగా!? ఏదో నీతో పాటుగా నీ పేరునీ తీసుకెళ్ళి ఎవరెస్టంత ఎత్తులో ఉంచావని "అన్నయ్య" అంటున్నాం కానీ మాతో కలసి నడిచిన మా "శివ శంఖర వరప్రసాదువి" కాదేంటి నువ్వు.. మనిద్దరి మజిలీ లో తీపిగుర్తులు ఎన్నని గుర్తుచేసుకోను చెప్పు!? నేను బడిలోకి వెళ్ళేప్పుడు "పున్నమి నాగు" వై ఎదురొచ్చిన నువ్వు, నాలుగేళ్ళ నీ తెర వయసుకే మా అందరి గుండెల్లో "ఖైదీ' వైపోయావు" ?? నేను పదకొండో యేటికొచ్చే సరికి నువ్వు వెండితెరపై వెలగడం కోసం "రాక్షసుడు"లా పనిచేస్తుంటే.. వీడేంటి మనల్ని మెప్పించడం కోసం "కిరాతకుడు"లా ఇంత కష్టపడుతున్నాడు అనుకొనేవాళ్ళం మన ఈడువాళ్ళలందరం ??**

నీకు గుర్తుందో లేదో 90'ల్లో వచ్చిన వరదలకి ఊళ్ళన్నీ నీళ్ళతో నిండిపోతే మేమందరం కలసి నీ **"జగదేకవీరుడు అతిలోక సందరి"** సినిమా చూడటంలో మునిగిపోయాం. నిజంగా అప్పుడు కురిసిన వర్షం. నన్ను ముంచేస్తుందేమో అని మన అశ్వనీదత్ భయపడితే "కాసుల వర్షమై" "వైజయంతి" పతాకాన్ని ఆకాశమంత ఎత్తులో ఎగరేసింది. 91'లో మా "గ్యాంగ్ లీడర్" గా ఉన్న నువ్వు..

నీ **"రౌడీ అల్లుడు"** సినిమాకి రమ్మని అక్కడే నా మేనత్త కూతురైన నా "రాధ"తో ప్రేమలో పడేలా చేసావు.

95'ల్లో నేను పెళ్ళిచేసుకొని మా అత్తింటోళ్ళందర్నీ నీ దగ్గరకు తీసుకొస్తే **"అల్లుడా మజాకా"** అన్నావు చూడు.. అప్పట్నుండి "మా ఊరి దేవుడు అందాల రాముడు" అంటూ ప్రతీ శ్రీరామ నవమికీ నీ పాటే రాములోరి గుళ్ళో వేయించడం మొదలెట్టేసాం ??

99'లో నాకు కొడుకు పుడితే నీ **"స్నేహం కోసం"** నేను రాలేదు, నీ కొడుకు, నేను **"ఇద్దరు మిత్రులం"** అన్నావు నువ్వు.. కొంచెం పెరిగి వాడికి మాటలొచ్చాకా నిన్ను చూసి వాడుకూడా నిన్ను **"అన్నయ్య"** అంటుంటే నన్ను వదిలేసి నువ్వు వాడివెంట పడుతున్నావేంటి అని నాకు అసూయ వచ్చేయడం మొదలయ్యింది. వాడితో ఆగిందనుకున్నావా!? నాకు 2001'లో పాప పుట్టింది. **"డాడీ"** అంటూ నువ్వొచ్చి ఆడపిల్లని ఎంత అపురూపంగా పెంచాలో నేర్పించావు. 22'లో నా కూతురు పెళ్ళికి **"గాడ్ ఫాదర్"**లా వచ్చావు.. రేపు నా కొడుకు పెళ్ళికి ఏ పేరుతో వస్తావో ఏంటో మరి!?

ఇలా ఒకటా రెండా!? ఎన్ని అనుభూతులని చెప్పను.. నీతో కలసి సాగిన నా ప్రయాణంలో!? **"స్వయంకృషి"**తో నువ్వు ఎదుగుతుంటే నిన్ను **"ఆరాధన"** గా చూస్తూ నీవెంట మేం నడిచేవాళ్ళం?

**"మాస్టర్"**వై నువ్వు సమాజంలో ప్రజలకు రక్తదానం, నేత్రదానం చెయ్యమంటే **"ఛాలెంజ్"**గా తీసుకొని ఈరోజుకీ ఆ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నడిపించడంలో నీవెంటే మేము నడుస్తున్నాం. కరోనా ప్రపంచాన్ని కాటేస్తున్న సమయంలో ఇంటి నాలుగుగోడల మధ్య చిక్కుకుపోయి భత్యం పెట్టే జీతం లేక నీ సినీ కార్మికులు దైన్యస్థితిలో ఉంటే వాళ్ళ ఆకలి తీర్చడానికి ముందడుగేసిన **"ఆపద్బాంధవుడు"**వు నువ్వు. ఎవ్వరు ఏమనుకున్నా స్వర్గం **"ఇంద్ర"** దేవుడిదైతే ఇక్కడి వెండితెర మాత్రం నీదే అన్నయ్య.

కవ్వించడం, నవ్వించడం, ప్రేమించడం, ఏడ్పించడం, కష్టమొస్తే నిలబడటం, ఓదార్చడం, లాలించడం, పాలించడం, అన్నీ మాకు నేర్పించిన నువ్వు నీ ముందు నిలబడి మాట్లాడడానికి సరిపోని కొన్ని శునకాలు నీ తిండితిని నీమీదే మొరుగుతుంటే "ద్వేషించడం" మాత్రం నాకు రాదన్నావు చూడు.. ఆ మాటతో మాకు "దేవుడివైపోయావు" నీకు రాకపోతేనేం అన్నయ్య..

మాకొచ్చు నేర్పించమంటావా అంటే వద్దు రా... తప్పు.. అది మీరూ నేర్చుకోకండి అంటూ సున్నితంగా మందలిస్తుంటావు. ఐనా నీమీద మాకున్న అమితమైన ప్రేమతో అప్పుడప్పుడూ నీకు నచ్చకపోయినా నువ్వు పెట్టిన ఈ హద్దుని మాలో కొందరు దాటేస్తూ ఉంటారు. చెప్తున్నానుగా అలా దాటేదీ నీమీద ప్రేమతోనే..

నీ శత్రువుని సైతం ప్రేమతో ఆలింగనం చేసుకోగల మంచు పర్వతానివి అన్నయ్య నువ్వు **"అంజి"**లో ఆ శివయ్య ఇచ్చిన అమృతం. **"దొంగ"**చాటుగా కొంచెం తాగేసావో ఏంటో నువ్వా మాకంటికెప్పుడూ నిత్య యవ్వనుడివే! పుట్టినందుకు నీ వయసు ఇదని చెప్పాలేమో గానీ మాలో కొందరి నాన్నలకు, మాకు, మా బిడ్డలకు, రేపు వాళ్ళకి పుట్టబోయే పిల్లలకు కూడా నువ్వెప్పుడూ **"అన్నయ్య'** వే" మా గుండెల్లో పచ్చబొట్టువై నిలచిపోయే మా "చిరంజీవి'వే"



**లవ్యూ అన్నయ్య..**

**"హ్యాపీ బర్త్ డే అన్నయ్య"**

– సతీష్ కుమార్ రాజా







# సేవాధీరుడు.. సూర శ్రీనివాసుడు

మొదటిపేజీ తరువాయి

సేవకుడిగా, నాయకుడిగా ప్రజల మనసుల్లో తన స్థానం పదిలం చేసుకున్నారు సూర శ్రీనివాసుడు. తన పుట్టిన రోజున తన పేరులో ట్రస్టు ప్రారంభించి అనతి కాలంలోనే ప్రజలకు అనేక సేవలందించి కలెక్టరు నుంచి సామాన్యుడి వరకు సుపరిచితుడయ్యారు. తాను చేసిన సేవలకు గానూ డాక్టరేట్ పట్టాను కూడా అందుకున్నారు.

### వ్యవసాయం నుంచి వ్యాపారం వైపు..

ఎచ్చెర్ల మండలం కుశాలపురం గ్రామంలోని వ్యవసాయ కుటుంబంలో జన్మించిన సూర శ్రీనివాసరావు ఎచ్చెర్ల, శ్రీకాకుళం నగరాల్లో వ్యాపార రంగంలో అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. శ్రమ పెట్టుబడి అయితే విజయం నీకు బానిస అవుతుందని ఓ మహనీయుడు చెప్పిన మాట సూర శ్రీనివాసరావులో స్ఫూర్తిని నింపింది. ఆ మాటే ఆయనను బాసటగా మలిచింది. సిక్కోలు జిల్లాలో ఎందరో లక్షలాధికారులు, కోటీశ్వరులు ఉన్నా మానవత్వం, దాతృత్వం ఉన్న మనిషిగా శ్రీనివాసరావు మాత్రమే జనం ముందుకొచ్చి కష్టకాలంలో ఉన్నవారిని ఆదుకొనేందుకు సిద్ధమవుతుంటారు. కరోనా కాలంలో అందరివాడిగా మన్ననలు అందుకున్న శ్రీనివాస్ ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్, రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఉన్నతాధికారులు, మేధావులు, సామాన్య పౌరులందరికీ ఇప్పుడు సుపరిచిరితుడు. అందరి ప్రశంసలు అందుకున్న వ్యక్తి కూడా.

సూర శ్రీనివాసరావు కుశాలపురం గ్రామంలోని రైతు కుటుంబంలో 1984 ఆగస్టు 23న జన్మించారు. తల్లిదండ్రులు వైకుంఠమ్మ, గన్నయ్యలకు ముగ్గురు పుత్రులు, నలుగురు పుత్రికలతో సహా 8వ సంతానమైన శ్రీనివాసరావు డిగ్రీ పూర్తి చేసి, అనంతరం వ్యాపార రంగంలో ఇంతింతై వటుడింతై చందంగా ఎదిగారు. ఒకవైపు వ్యాపారం చేస్తూనే మరోవైపు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ వచ్చారు. రెండు రంగాల్లోనూ ఈయన తనకంటూ ప్రత్యేక స్థానం ఉందని నిరూపించుకోగలుగుతున్నారు.

### పారిశ్రామికవేత్త.. సామాజికవేత్త..

సమాజంలో పదిమందికి సహాయ పడాలంటే డబ్బు కచ్చితంగా ఉండాలి. డబ్బుంటే సరిపోదు.. పదిమందికి సహాయం చేయాలన్న తపన కూడా ఉండాలి. వ్యవసాయ రంగం నుంచి వచ్చిన శ్రీనివాసరావు పారిశ్రామికవేత్తగా క్రమక్రమంగా ఎదుగుతూ తాను సంపాదించిన డబ్బు జనానికి కూడా ఉపయోగపడాలన్న ఉద్దేశంతో సామాజికవేత్తగా కూడా ఎదిగారు.




## 'ఆయన' సేవల వెంట 'ఆమె'



సంపాదించే పురుషులు విపరీతంగా ఖర్చు చేస్తుంటారు. మహిళలు మాత్రం పొదుపు చేయడానికి ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. సూర శ్రీనివాస్ సమాజం కోసం ఏదో చేయాలన్న తపన పడుతున్నప్పుడు స్పందించే మొట్టమొదటి వ్యక్తి ఆయన సతీమణి సరితారాణి. జిల్లాలోని అనేక దేవాలయాలు, పలు పాఠశాలల్లో విగ్రహాల ఏర్పాటులో ఆయన సతీమణి సరితారాణి సహకారం ఎంతో ఉంది. మంచి కోసం ఎంతైనా ఖర్చు చేయడం తప్పుకాదని, అది ఉపయోగిస్తే అంతకంటే కావాల్సింది ఏముంటుందని ఆమె అంటుంటారు. 2015లో ఏప్రిల్ 2న కింతలి గ్రామానికి చెందిన త్రినాథరావు, హైమావతిల ఏకైక కుమార్తె సరితారాణితో వివాహం అయిన నాటి నుంచి ఇటు వ్యాపార రంగంలోనూ, ఇటు సేవా రంగంలోనూ సూర శ్రీనివాస్ దూసుకుపోతున్నారు. తన భర్త చేసే సామాజిక సేవా కార్యక్రమాలు తమ పిల్లలు జ్యోతిప్రియ, జస్మితకు పెద్దల దీవెనలుగా ఆమె భావిస్తూ ఉంటారు. సమాజం కోసం చేసిన ఏ ఒక్క సహాయం వృథా కాదని ఆమె బలంగా నమ్ముతారు. పేద విద్యార్థుల సహాయంలో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి పేదరికం గురించి ఎక్కువగా తెలుస్తోంది. అలా గ్రామీణ నేపథ్యం ఉన్న సూర శ్రీనివాస్‌కు చదువుకున్న రోజుల్లో సమస్యల్లో ఉన్న పేద వారిని చూసి, వారి కోసం ఏదో చేయాలన్న తపన ఉండేది. చదువు పూర్తయి వ్యాపార రంగంలోకి వచ్చాక తన సంపాదనలో పేద విద్యార్థులను చదివించేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. ప్రతీ ఏటా పుస్తకాలు, యూనిఫారాలు సూర శ్రీనివాస్ అందిస్తూ ఉంటారు. పేదరికం వల్ల ఉన్నత విద్యకు అవకాశం లేని ఎందరికో ఆర్థికంగా ఆయన సహాయం అందిస్తున్నారు. దశాబ్దకాలంగా ఈయనకి ఆధ్యాత్మిక, సామాజిక, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిస్తూ పేదలకు సహాయం చేస్తూనే ఉన్నారు. ప్రతీ సేవలోనూ ఆయన వెంట ఆమె ఉన్నారు. అందుకే సరితారాణి తన సతీమణి అనడం కన్నా సహధర్మచారిణి అనేందుకే ఇష్టపడతానని శ్రీనివాస్ చిరునవ్వులు చిందించారు.





### పెద్దల మన్ననలు.. ప్రముఖ సంస్థల పురస్కారాలు..

కష్టపడి పని చేయడమే కాదు.. ఇష్టపడి పని చేయడం సూర శ్రీనివాస్‌కు సహజ లక్షణం. తాను చేయాలన్నది ఏదైనా కచ్చితంగా చేసి తీరుతారు. వ్యాపారం, వ్యవహారంలో కూడా ఈయనంటేనే ఎందరికో నమ్మకం. పారిశ్రామికవేత్తగా, సామాజికవేత్తగా ఎదుగుతున్న క్రమంలో సూర శ్రీనివాసరావు అత్యున్నత స్థాయిలో ఉండే నేతలు మొదలు పార్టీలకతీతంగా నాయకులు, పౌర సంఘాల నుంచి మన్ననలు అందుకుంటూనే ఉన్నారు. ఇక ప్రముఖ సంస్థల నుంచి కూడా సూర శ్రీనివాసరావు అందుకున్న అవార్డులు, సన్మానాల సంఖ్య తక్కువేమీ కాదు.

### ఆలయాల నిర్మాణం.. పునర్నిర్మాణంలో..

వ్యాపార రంగంలో తాను సంపాదించే డబ్బులో కొంతమేరకు దేవుడికి, మరికొంత మేరకు దేవుడి లాంటి మనిషికి ఇవ్వాలని శ్రీనివాస్ తపన పడుతూ ఉంటారు. దశాబ్దకాలంగా జిల్లాలో ఎన్నో దేవాలయాల నిర్మాణంలోనూ, పలు దేవాలయాల పునర్నిర్మాణంలోనూ ప్రముఖమైన పాత్ర ఈయన పోషించారు.

### సాయమందించే హస్తం..

కోవిడ్ కాలంలో ఇళ్ల నుంచి బయట వచ్చేందుకు జనం భయపడే వారు. ఆసుపత్రుల్లో వందలాది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. తొలి విడత కోవిడ్ సమయంలోనే జనానికి ఆదుకోవాలని శ్రీనివాస్‌కు అనిపించింది. ఆలోచన వచ్చిందే తడవుగా మూడు విడతల కోవిడ్ సమయంలోనూ బాధిత జనానికి బాసటగా నిలిచారు. లాక్‌డౌన్ రెండు దశల్లో శ్రీనివాస్ చేపట్టిన సేవా కార్యక్రమాలు వేలాది మంది బాధిత జనానికి ప్రయోజనం చేకూర్చాయనడంలో సందేహం లేదు. కోవిడ్ సమయంలో శ్రీనివాస్ ఆదుకొనేతత్వం జిల్లా వ్యాప్తంగా ఎంతో గుర్తింపును, గౌరవాన్ని తీసుకొచ్చేలా హృదయం చేసింది. మానవత అంటే శ్రీనివాసే అని జనం కూడా ప్రశంసిస్తూ వచ్చారు. రాష్ట్రస్థాయి ప్రముఖ నేతలు, ఉన్నతాధికారుల ప్రశంసలతో పాటు ప్రముఖ సంస్థల నుంచి పురస్కారాలు అందుకున్నారు. 41 రోజుల పాటు కోవిడ్ బాధితులకు పెద్ద ఎత్తున ఆహారం సరఫరా చేశారు. ప్రతీ ఏడాది పరీక్ష సమయంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అట్టలు, పెన్నులు, పరీక్షా సామగ్రి అందజేస్తున్నారు.


















# అదే 'సత్యం'.. అది సర్కారు స్థలం!

(మొదటిపేజీ తరువాయి)

ఆశ్రయించారు. వారిచ్చిన ఆధారాల ప్రకారం 'ప్రభుత్వ భూమిని జిరాయితీగా మార్చిన వైనాన్ని వివరిస్తూ 'సత్యం' సమగ్ర కథనం ప్రచురించింది. దాంతో ఉలిక్కిపడిన రెవెన్యూ అధికారులు వెంటనే చర్యలకు పూనుకున్నారు. ఆ మేరకు మండల సర్వేయర్, సచివాలయం సర్వేయర్ వివాదంలో ఉన్న భూమిని సర్వే చేసి.. ప్రభుత్వ భూమిగా నిర్ధారించి సరిహద్దులు ఏర్పాటు చేశారు.

### రెండో అంశం వదిలేశారు

అయితే రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నెంబర్ 211/6లో ప్రభుత్వ భూమి 1.56 ఎకరాల విస్తీర్ణంగా పేర్కొనగా.. రీసర్వే అనంతరం దాన్ని 1.82 సెంట్లకు పెంచేశారు. కానీ గురువారం నిర్వహించిన సర్వేలో మళ్లీ 1.56 ఎకరాలుగానే చూపించి హద్దులు నిర్ణయించారు. రీసర్వేలో చూపించిన అదనపు భూమి ఎవరి ఖాతాలో వేశారో తెలియాల్సి ఉంది. అలాగే సర్వే నెంబర్ 211/8లో మొత్తం విస్తీర్ణం 1.75 ఎకరాలు జిరాయితీగా రికార్డుల్లో ఉంది. కానీ రీసర్వే తర్వాత దాన్ని 2.06 ఎకరాలుగా నమోదు చేశారు. దీనిపైనా బొంది రామణారావు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. ఈ సర్వే నెంబర్‌లోని 50 సెంట్ల స్థలంలో ప్రభుత్వ పాఠశాల ఉండగా, రీసర్వే తర్వాత దాన్ని 30 సెంట్లకు కుదించారు. మిగతా 20 సెంట్లు వేరొకరి ఖాతాలో నమోదుచేశారు. దీనిపైనా రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని బొంది రమణారావు తెలిపారు.

ఫిర్యాదులో ఒక అంశానికి చెందిన వివాదాన్నే పరిష్కరించిన అధికారులు మరో అంశాన్ని పట్టించుకోకుండా ఫిర్యాదులో పేర్కొన్న అన్ని అంశాలకు పరిష్కారం చూపించినట్టు పేర్కొంటూ రెవెన్యూ అధికారులు తనతో సంతకాలు చేయించుకున్నారని రమణారావు 'సత్యం'కు వివరించారు. ఆక్రమణలో ఉన్న భూమికి హద్దులు నిర్ణయించి ప్రభుత్వ భూమిగా నిర్ధారించడం కొంత ఉపశమనం కలిగించిందని సంతృప్తి వ్యక్తం చేశారు.

# డీమ్డ్ ఫీట్లు.. కాలేజీల పాట్లు

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాలో ఇటువంటి కాలేజీల వైపు ఓ మోస్తరు విద్యార్థులు కూడా చూడటంలేదు. మన రాష్ట్రంలో ఉన్న డీమ్డ్ వర్సిటీలే కాకుండా వెల్లూరు, బెంగళూరు, చెన్నై, కోయంబత్తూర్‌తో పాటు పంజాబ్ లాంటి పలు రాష్ట్రాల్లో ఉన్న డీమ్డ్ వర్సిటీల వైపు చూస్తున్నారు. ఫీజ్ ఎంతైనా తగ్గడంలేదు. ఒక విద్యార్థి ఒక డీమ్డ్ యూనివర్సిటీలో చదవాలంటే ఫీజు రూపేణా తక్కువలో తక్కువ రూ.35 లక్షలు ఖర్చవుతుంది. దీనికి హాస్టల్, మిగతా ఫీజులు అదనం. అయినా కూడా అప్పోసప్పో చేసి డీమ్డ్ వైపే వెళుతున్నారు. ఒకప్పుడు జేఎన్టీయూ, ఆంధ్రా యూనివర్సిటీల్లో సీటు దొరికితే గొప్ప అనుకున్న పరిస్థితి ఉంటే.. ఇప్పుడు అవే యూనివర్సిటీల్లో దాదాపు 1400 సీట్లు మిగిలిపోయాయి. రాష్ట్రంలో నిర్వహించిన ఇంజినీరింగ్ ప్రవేశ్ పరీక్షలో మొదటి 200 ర్యాంకులు పొందినవారిలో కేవలం ఇద్దరే కౌన్సెలింగ్‌లో పాల్గొంటే.. 500 లోపు ర్యాంక్ సాధించినవారు 12 మంది మాత్రమే పాల్గొన్నారు. అయితే వీరు రాష్ట్రంలో ఏదైనా కాలేజీలో జాయిన్ అయ్యారా అంటే అదీ సందేహమే. కారణం నాలుగువేల ర్యాంక్ లోపు వచ్చిన విద్యార్థులకు ఐఐటీ, ఎన్ఐటీలలో సీట్లు వచ్చే అవకాశం ఉంది. ఇప్పుడు తల్లిదండ్రులు బ్రాండ్ కోసం తమ పిల్లలను ఏదో ఒక ఐఐటీ లేదా ఎన్ఐటీలలో నాన్ ఇంజనీరింగ్ కోర్సులు అంటే హ్యూమానిటీస్ కోర్సుల్లో కూడా చేర్చుతున్నారు. వాస్తవానికి ఈ ఇన్‌స్టిట్యూట్స్ వాటి కోసం ఏర్పాటు చేసినవి కావు. కేవలం సాంకేతిక విద్యలో పరిశోధన కోసం నెలకొల్పబడినవి. ఈ ఏడాది రెండు తెలుగు రాష్ట్రాల నుంచి లక్షల్లో విద్యార్థులు డీమ్డ్ యూనివర్సిటీల్లో చేరారు. అనేక మంది ఆయా సంస్థలు నిర్వహించిన ఎంట్రన్స్ పరీక్షల్లో అర్హత సాధించినవారు కాగా, వేల సంఖ్యలో విద్యార్థులు ఒక మోస్తరు ర్యాంక్ కూడా పొందనివారు ఉన్నారు. ఆ యూనివర్సిటీలు నిర్వహించే పరీక్ష ఆధారంగా కాకుండా స్లాబులుగా విభజించి పెద్ద ఎత్తున ఫీజులు వసూలు చేసి విద్యార్థులను జాయిన్ చేసుకుంటున్నాయి. ఇంజినీరింగ్ పూర్తయ్యే సరికి హాస్టల్‌తో కలుపుకుని రూ.40 లక్షల వరకు ఖర్చవుతుందని తెలిసినా తల్లిదండ్రులకు వాటిపై వ్యామోహం తగ్గడం లేదు. అక్కడ చేరిస్తే కొలువు ఖాయమన్న నమ్మకంతో పిల్లలను జాయిన్ చేస్తున్నారు. కానీ వాస్తవానికి ప్లేస్‌మెంట్స్ విషయంలో జరుగుతున్న అక్రమాల తంతు వీరికి తెలియడం లేదు.

### ప్రచారం కోసం ఉత్తుత్తి క్యాంపస్ డ్రైవ్‌లు

సాధారణంగా ప్రతి ఏడాది ఇలాంటి యూనివర్సిటీలు ప్రాంగణ నియామకాలు (క్యాంపస్ డ్రైవ్స్) చేపట్టి విద్యార్థులను ఎంపిక చేసి ఆఫర్ లెటర్స్ ఇస్తుంటాయి. వీరిలో కొంతమందికి మాత్రమే సంబంధిత కంపెనీలు ఉద్యోగాల్లోకి తీసుకుంటాయి. ఇక్కడ ఒక విషయం తల్లిదండ్రులు తెలుసుకోవాలి. యూనివర్సిటీలు, ఇంజినీరింగ్ కళాశాలలు న్యాక్, ఎన్బీయే, అటానమస్ హోదాలను పొందడానికి లేదా కాపాడుకోవడానికే ఇలాంటి ప్రాంగణ నియామకాలు చేపడుతుంటాయి. పెద్దసంఖ్యలో తమ విద్యార్థులకు ఉద్యోగాలు ఇప్పించామని చెప్పించుకోవడం, ఆ మేరకు రికార్డుల్లో నమోదు చేయడమే వాటికి ముఖ్యం. ఇక కొన్ని కంపెనీలు విదేశాల నుంచి ప్రాజెక్టులు పొందడానికి ఘోస్ట్ నియామకాలు చేపడుతుంటాయి. తమ వద్ద పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఉన్నారని తెలపడం కోసం ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రాంగణ నియామకాలు నిర్వహించి విద్యార్థులకు ఆఫర్ లెటర్లు అందజేసి అటు తర్వాత మొహం చాటేస్తాయి. విద్యార్థులు ఈ నియామకాలు నిజమని నమ్మి కొంతకాలం వేచి చూసిన తర్వాత ఉసూరుమంటూ ఏదో ఒక కంపెనీలో ఎంతో కొంత జీతానికి చేరిపోతారు. అందువల్ల లక్షలకు లక్షలు ఖర్చు చేసి ఇలాంటి యూనివర్సిటీల్లో చదివించడం ద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్న ఆలోచన నుంచి తల్లిదండ్రులు బయటపడాలి. అనేక మంది విద్యార్థులు అక్కడ పెట్టే భోజనం చేయలేక బయట క్యాంటీన్లలో తింటూ అనారోగ్యం పాలైన సందర్భాలు ఉన్నాయి. చెడు స్నేహాల బారిన పడి డ్రగ్స్, గంజాయి లాంటి వ్యసనాలకు బానిసైన పరిస్థితులు ఉంటున్నాయి. తమ సర్కిల్స్‌లో ఉన్న పిల్లలను అక్కడ జాయిన్ చేశారన్న ధీమాతో అలాంటి నిర్ణయం తీసుకోవడం అనాలోచితం. ఇక మన ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న ఇంజినీరింగ్ కాలేజీల్లో సగానికిపైగా అటానమస్ హోదా ఉన్నవే. ప్రముఖ పారిశ్రామికవేత్తల ఆధ్వర్యంలో నడుస్తున్నవే. ఈ కళాశాలల్లో చదివే విద్యార్థులకు క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహించి కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. దురదృష్టవశాత్తు తల్లిదండ్రులు, విద్యార్థులు ఆ కంపెనీలు చిన్నవన్న తప్పుడు భావనతో వాటిలో చేరడం చిన్నతనంగా భావిస్తున్నారు. నైపుణ్యం ఉన్న విద్యార్థి ఎక్కడైనా రాణించగలడని విశ్వసించాలి. నేటి సాంకేతిక యుగంలో అనేక కోర్సులు ఆన్‌లైన్‌లో నేర్చుకోవచ్చు. స్కిల్ పెంపొందించుకోవచ్చు. మన ప్రాంతంలో చదువుకుని కూడా మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చు అని తెలుసుకోవాలి.

# ఏపీ వీఎస్‌కేవీ యువజన అధ్యక్షుడిగా పెద్దింటి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



విశ్వ సాహితీ కళా వేదిక ఆంధ్రప్రదేశ్ యువజన అధ్యక్షుడుగా కవి, వక్త వ్యాస రచయిత డాక్టర్ పెద్దింటి ముకుంద రావును నియమించినట్లు ఆ సంస్థ చైర్మన్ కొల్లి రమావతి నియామకం పత్రం ద్వారా తెలియజేశారు. మంచి సాహిత్యం అందరికీ అందాలని, తెలుగు భాషా సాహిత్యాలపై యువతలో అభిమానం యువతలో నింపే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. విశ్వ సాహితీ కళా వేదిక నిరంతరం సాహిత్య, సాంస్కృతిక సేవా కార్యక్రమాలు చేయాలనే తలంపుతో ప్రారంభించిన తమ సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా డా.ముకుందరావు మాట్లాడుతూ యువజన అధ్యక్షుడుగా తనను నియమించినందుకు చైర్మన్ రమావతి, సంస్థ కన్వీనర్ ఈ వేమన గారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# కోండ్రు మురళికి కృతజ్ఞతలు

(సత్యంన్యూస్, రేగిడి)

మండలంలోని గ్రామాలకు తోటపల్లి ప్రాజెక్టు ద్వారా సాగునీటి విడుదలకు కృషి చేసిన రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు కడగల నాగరాజు తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తోటపల్లి ప్రాజెక్టు నుండి కాలువలున్నా సాగునీరు రాకపోవడంతో రేగిడి మండల రైతులు కొన్ని సంవత్సరాలనుండి తీవ్రంగా పంటలు నష్టపోయారన్నారు. కోండ్రు మురళీ మోహన్ ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత కాలువలు బాగుచేసి సాగునీటి విడుదలకు చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. రాజాం నియోజకవర్గంలోని రైతాంగ సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి జలవనరుల మంత్రితో పాటు సాగునీటి ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరించారన్నారు. తోటపల్లి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మండలంలోని తోటపల్లి ఆయకట్టు గ్రామాలన్నింటికి ప్రాధాన్యత ప్రకారం నీరు అందేలా చూడాలన్నారు.



# కుక్కలకు వీధుల్లో ఆహారం పెట్టొద్దు

### - సుప్రీం కీలక ఆదేశాలు -

**న్యూఢిల్లీ:** వీధికుక్కల బెడదకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు వెలువరించింది. వీధులు లేదా బహిరంగ ప్రదేశాల్లో వీటికి ఆహారం అందించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. వీధి కుక్కలకు నిర్దేశిత ప్రాంతాల్లోనే ఆహారం అందించాలని, ఇందుకోసం అధికారులు ప్రతి వార్డులో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటుచేయాలని పేర్కొంది. ఆ ప్రాంతాల్లో మాత్రమే ఆహారం అందించాలని సూచిస్తూ నోటీసు బోర్డులు ఏర్పాటుచేయాలని వెల్లడించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ వీధుల్లో కుక్కలకు ఆహారం ఇవ్వకూడదని, ఈ ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నియంత్రణ లేకుండా ఆహారం ఇవ్వడం వల్ల అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని వచ్చిన నివేదికలను పరిగణనలోకి తీసుకొని ఈ ఆదేశాలు జారీచేస్తున్నట్లు చెప్పింది. సామాన్య పౌరులు వీధుల్లో నడిచేటప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇటువంటి పద్ధతికి స్వస్తి పలకాలని అభిప్రాయపడింది.

# డిడి అమౌంటు ఆన్ కాల్ డ్రైవర్లకు కూడా చెల్లించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రెగ్యులర్ డ్రైవర్లకు ఇచ్చే డి.డి. (డబుల్ డ్యూటీ) అమౌంట్‌ను ఆన్ కాల్ డ్రైవర్లకు కూడా చెల్లించాలని ఏపీపీటీడీ (ఆర్టీసి) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్యలు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వీటిపై ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు వినతిపత్రం అందజేశామన్నారు. ఇటీవలే డబుల్‌డ్యూటీ చేసే కండక్టర్లకు రూ.700ల రూ.900లకు, డ్రైవర్‌కు రూ.800ల నుండి రూ.వెయ్యి చెల్లించాలని, స్పెషల్ ఆఫ్ డ్యూటీలకు, నైట్‌హాల్ట్ డ్యూటీకి వెళ్లే కండక్టర్లకు రూ.1800లు, డ్రైవర్లను రెండు మస్టర్లు వచ్చే డ్యూటీలకు పంపితే రూ.2వేలు చెల్లించాలని యాజమాన్యం ఆదేశాలు ఇచ్చినందుకు రాష్ట్ర కమిటీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నామన్నారు. అదేవిధంగా ప్రతిరోజు డ్యూటీలకు వెళ్లే సిబ్బందికి చెల్లించే డైలీ ఇన్సెంటివ్‌లను గతంలో అద్దె బస్సు/ఆన్ కాల్ డ్రైవర్లకు కూడా చెల్లించేవారని, కానీ ప్రస్తుతం అద్దె బస్సు డ్రైవర్లకు కొన్నిడిపోలలో మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. వీటిని పరిశీలించాలని కోరామన్నారు.



పాలకొండ రెవెన్యూ డివిజన్‌ను జిల్లా చేయాలి, లేకుంటే పాత శ్రీకాకుళం జిల్లాలోనే ఉంచాలని కోరుతూ పాలకొండ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు కనపాక చౌదరినాయుడు, వండాన కూర్మారావు, సబ్బ నానాజీ, డాక్టర్ చిరంజీవి పాత్రో, ఆర్ఎంపీ డాక్టర్ త్రినాధరావు, కొట్నాన అప్పన్న, కోటేశ్వరరావు, సుంకర గురునాథరావు తదితరులు పాల్గొన్నారు. **- సత్యంన్యూస్, పాలకొండ**

# ప్రధానమంత్రి టిబి ముక్త భారత అభియాన్ కార్యక్రమం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రధానమంత్రి టిబి ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తొగరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం క్షయ వ్యాధిపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సత్యనారాయణరావు తెలిపారు. కార్యక్రమానికి రిసోర్స్‌పర్సన్‌గా వైద్యాధికారిణి డాక్టర్ ఆర్.అనురాధ, హాజరై మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ, ప్రభుత్వ పథకాలు అమలు గురించి, క్షయ వ్యాధి గ్రస్తుల ఎడల కమ్యూనిటీ సపోర్ట్ గురించి వివరించారు. ముఖ్యంగా పోషకపదార్థాల ఆవశ్యకత రోధక నిరోధక శక్తి పెంపొందించుకోవడం పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పిస్తూ సమీపంలో ఈ లక్షణాలు ఉంటే తెలపాలన్నారు. సహాధ్యక్షులు డాక్టర్ ఎం.సత్యనారాయణరావు మాట్లాడుతూ క్షయవ్యాధి నివారణకై క్షయమిత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామారావు, ఐక్యుఏసి సమన్వయకర్త డాక్టర్ డి.పైడితల్లి, కార్యక్రమ సమన్వయకర్త డి మహేశ్వరి, అధ్యాపక, ఆధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

# మొక్కలు నాటడం ఒక బాధ్యత




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా శ్రీకాకుళం 1980స్ చిరంజీవి ఫాన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం గుజరాతీపేట జగన్నాధ స్వామి గుడి ప్రాంగణంలో శ్రీ ఆంజనేయ స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ ప్రాంగణంలో కొన్ని మొక్కలను మెగా అభిమానులు నాటారు. ఈ సందర్భంగా వర్కింగ్‌అధ్యక్షులు వంజ రాపు రాము మాట్లాడుతూ తమ అభిమాన నటుడు మెగాస్టార్ చిరంజీవి ఆశయాల మేరకు ఈ మొక్కలు నాటామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అంధవరపు సంతోష్, వార్డు ఇన్‌చార్జ్ కె.భాస్కర రావు, కె.రాము, మెగా అభిమానులు, పాలకులు శ్రీనివాసరావు, నరసింహం, తిరుమలరావు, మురళి, బెల్లాల శ్రీనివాసరావు, రామారావు, పి.గోవింద్, శ్రీనివాసరావు, అప్పారావు, ఊరిటీ సునీల్, పోస్టుమెన్ శ్రీను, గిరి, పవన్, బూరవెల్లి శ్రీనివాస్, సత్యనారాయణ, పైడి శ్రీను, రామరాజు పలువురు పాల్గొన్నారు.

# శ్రీ మేధా దక్షిణామూర్తికి అష్టోత్తర పుస్తకార్చన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

హైదరాబాద్‌లోని పంజాగుట్ట ప్రాంతంలో గల శ్రీ మేధా దక్షిణామూర్తికి అష్టోత్తర పుస్తకార్చన నిర్వహించారు. కాశిన వెంకటేశ్వర రావు, రమణమ్మ దంపతులు తమ స్వీయరచనగా నమో శ్రీ దక్షిణా మూర్తి అనే 108 పుస్తకాలతో విశ్వజయము గ్రూప్ సభ్యుల పిల్లల శ్రేయస్సు కోసం అర్చన జరిపించి, వాటిని భక్తులకు వితరణ చేయమని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త జి.చంద్రశేఖర్‌కు అందజేశారు. ఈ పుస్తకంలో భారతదేశంలోని పురాణ ప్రసిద్ధ, సుప్రసిద్ధ, లింగ రూపంలో గల, విచిత్ర విగ్రహాలు గల స్వామి ఆలయాల విశేషాలను, అతని చరిత్ర, స్తోత్రాలు పొందుపర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ కృష్ణ, ప్రధానార్చకులు మల్లాది దుర్గాప్రసాద్, భరత్, రామకృష్ణ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# పురాతన మెట్ల బావిని పునర్నిర్మించండి

(సత్యంన్యూస్, గార)

మండలంలోని నిజామాబాద్ గ్రామంలో 1640 సంవత్సరంలో షేర్ మహమ్మద్ ఖాన్ నిర్మించిన అతిపెద్ద మెట్ల బావిని పర్యాటక కేంద్రంగా మలచాలని, ఇందుకు సహకారాన్ని అందించమని ఎమ్మెల్యే గొండు శంకర్‌ను శుక్రవారం ఇంటాక్ శ్రీకాకుళం బృందం కోరింది. ఈ మేరకు ఆ బావి చరిత్ర విశిష్టతలను తెలుపుతూ ఒక వినతి పత్రాన్ని ఆయనకు బృందం సమర్పించింది. శ్రీకాకుళం నియోజకవర్గంలో ఎన్నో పర్యాటక కేంద్రాలు ఉన్నాయని, వాటిని ప్రజా దర్శనార్థం చక్కగా రూపకల్పన చేయాల్సిన బాధ్యత అందరికీ ఉందన్నారు. ఈ ప్రభుత్వంలో పర్యాటక రంగ అభివృద్ధి కోసం ప్రత్యేక కృషి జరుగుతుందని ఎమ్మెల్యే శంకర్ వివరించారు. ఈ ప్రాంతాన్ని సందర్శించి దీని పునరుద్ధరణకు తగిన సూచనలతో నివేదిక అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కన్వీనర్ నూక సన్యాసిరావు, కో-కన్వీనర్ నటుకుల మోహన్, అదనపు కన్వీనర్లు వావిలపల్లి జగన్నాథ నాయుడు, కొమ్ము రమణమూర్ సభ్యులు తదితరులు ఉన్నారు.



# సౌమ్యను పరామర్శించిన వివిధ సంఘాల నాయకులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్యను వారి స్వగృహంలో ఐద్వా శ్రీకాకుళం జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జోగి గున్నయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిర్ల ప్రసాద్, గంగారాపు సింహాచలం, జిల్లా కమిటీ సభ్యులు సిర్ల మంగమ్మ, జోగి నర్సింహులు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు ప్రిన్సిపల్ అక్రమ బదిలీల సమస్యలను పక్కనపెట్టి రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవడం దురదృష్టకరమన్నారు. జిల్లా ప్రాజెక్ట్ అడిషనల్ కో-ఆర్డినేటర్ చేసిన తప్పుడు బదిలీల కారణంగా మనస్తాపానికి గురైన కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్యకు తక్షణమే మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా బాధితురాలిపై సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్‌ను తక్షణమే ఆపాలని, ఇలాంటి అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా ప్రిన్సిపాల్ సమస్యలపై శాశ్వత పరిష్కారం చెప్పకుండా రాజకీయాలు చేయడం అత్యంత దిగజారుడు చర్య అని నేతలు తీవ్రంగా విమర్శించారు. తక్షణమే అక్రమ బదిలీలను రద్దు చేయాలని, మొత్తం వ్యవహారానికి కారణమైన ఏపీసీని తక్షణమే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో శ్రీకాకుళం జిల్లాలో ఉండే ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు అంతా పోరాటానికి సిద్ధమవుతాయని నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.